# సూర్యచంద్రులు

"ఉపయోగించుకోవడం తెలిస్తే అవకాశం ఎప్పుడూ ఉండేదే- కొత్తగా ఏర్పడదు.''

మధ్యాహ్నం మహిళామండలి మీటింగులో రామాయమ్మ చెప్పిన మాటలు రోజా చెవిలో మార్మోగుతున్నాయి. ఆమె మనసు ఆలోచనల తేనెటీగలతో గజి బిజిగా ఉంది.

తనకు పెళ్ళయి మూణ్ణెల్లు అయింది. కాపరానికి వచ్చింది. ఉమెన్స్ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. తన భర్త అదేదో కంపెనీలో ఎకౌంట్స్ ఆఫీసరు.

ఇల్లు, కాలేజీ, వంటగది, పడగ్గది. ఇంతకుమించి జీవితంలో మార్పు ఉండదా? మూడు నెలలకే యాంత్రిక జీవనం అనిపించింది రోజాకి. తన తల్లి శాంతమ్మ నయం. సంగీత కచ్చేరీలిస్తూ, నలుగురిలో తిరుగుతూ హాయిగా గడుపుతోంది. తనకూ ఈ రొటీన్ లైఫ్‌నుంచి మార్పు కావాలి అనుకుంటుండగా ఆ రోజు ఉదయమే పక్కవీధి మహిళా మండలి సభ్యులు వచ్చి మధ్యాహ్నం సమావేశానికి తనను ఆహ్వానించారు. కాలేజీకి ఎలాగూ సెలవులు. ఇంటిదగ్గర ఒంటరిగా కూర్చుని ఏం చేస్తుంది తను? వస్తానని మాట ఇచ్చింది. అన్నమాట ప్రకారం వెళ్ళింది.

అక్కడ ఉన్నంతసేపూ రోజా మనసు కొత్త అనుభూతులతో నిండి పోయింది. రకరకాల ఆడవాళ్ళు, కొత్తకొత్త ఫ్యాషన్లు, ఆధునిక అనుభవాల సమాహారంలా అనిపించింది ఆ సమావేశం. విభిన్న మనస్తత్వాల స్త్రీలు ఒక చోట చేరి, ఒకే కేంద్ర బిందువులాంటి అంశంమీద ఆవేశంగా ప్రసంగించటం- అదే పురుషాహంకారాన్ని ఎదిరించటం.

ఒక్కొక్కరు చెప్పే ఉదాహరణలకి రోజా స్పందించింది. ఉత్తేజం పొందింది. తరతరాలుగా స్త్రీ ఎలా అణచివేయబడుతుందో కళ్ళముందు సినిమా రీలులా తిరిగింది. ముఖ్యంగా ఆ సమావేశానికి అధ్యక్షత వహించిన రామాయమ్మ చెప్పిన ప్రతి మాటా రోజా మనసులో బలంగా నాటుకున్నాయి.

తాగుబోతు భర్తతో చావుదెబ్బలు తిని పుట్టింటికి పారిపోయి వచ్చిన తన ఊళ్ళోని పక్కింటి విశాలాక్షి, ప్రతి నిముషం అనుమానించే భర్త సూటీపోటీ మాటలు పడలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న అనసూయ, కట్నం డబ్బు పూర్తిగా ఇవ్వలేదని అత్తింటినుంచి వెళ్ళగొట్టబడిన భారతి— వీళ్ళంతా రోజా మనసులో మెదిలి అల్లరి చేశారు.

'మగాడి అహంకారానికి స్త్రీ ఇంతగా అణగారిపోతోందా?' అనిపించింది రోజాకి. ఇంటికి తిరిగి వచ్చిందేగాని రోజాని ముసురుకున్న ఆలోచనలు వీడనే లేదు. అన్యమనస్కంగానే వంట చేసింది. మంచంమీద పడుకొని శూన్యంలోకి చూస్తూనే ఉంది.

క్రాంతి ఎప్పుడు వచ్చాడో తెలీనేలేదు. స్నానం చేసి వచ్చి పిలిచాడు. లేచి అన్నం పెట్టింది. తర్వాత మళ్ళీ వెళ్ళి మంచంమీద వాలింది.

"నేను ఉదయం ఏడింటికల్లా వెళ్ళాలి!'' అన్నాడు క్రాంతి.

రోజా 'ఊఁ' అంది

క్రాంతికి ఆమె అలా ఎందుకుందో అర్థంకాలేదు. అలా చాలా సేపు గడిచింది. క్రాంతికి మనసాగలేదు. మంచంమీద రోజా కాస్త కదిలింది.

"రోజా! ఇంకా పడుకోలేదా?"

"లేదండీ! నిద్దర రావడం లేదు."

"ఏం? ఎందుకనీ? మధ్యాహ్నం బాగా నిద్రపోయావా?"

"లేదు. మధ్యాహ్నం నేనసలు ఇంట్లోనే లేను."

"ఎక్కడికి వెళ్ళావ్? షాపింగుకా?"

"అదుగో, అక్కడే మీ మగబుద్ధి! ఆడది బయటికి వెళితే షాపింగుకి తప్ప ఇంక దేనికీ వెళ్ళదు; చీరలూ నగలూ పెట్టుకుని ఆనందించడం తప్ప, ఇంక ఎందుకూ పనికిరాదు - ఇవేగా మీ ఆలోచనలు? ఆమెకీ ఒక వ్యక్తిత్వ

ముందనీ. ఆమే మనిషేననీ ఛస్తే అనుకోరు మీ మగవాళ్ళు ఛీ! ఛీ! ఆడదంటే ఆటబొమ్మ! పెళ్ళామంటే పాదదాసి! అంతకంటే మీరు....ఆలోచించలేరు"

వింతగా ఆమెకేసి చూశాడు క్రాంతి. చిరునవ్వుతో ఆమె నడుంచుట్టూ చెయ్యి వేసి, మంచం దగ్గరగా కిటికీలో వున్న టార్చ్‌లైట్‌తీసి ఎదురుగ్గా గోడ మీద వున్న గడియారం కేసి చూశాడు. టైము సరిగ్గా మూడయింది. లైటా ర్పేసి రోజా కేసి చిలిపిగా చూశాడు.

"ఏమిటా చూపులు?" కోపం అభినయిస్తూ అడిగింది రోజా.

"సీకట్లో సూడాలి నా యెంకి అందాలు - ఎంకిపాట గుర్తుకొచ్చింది. అర్ధరాత్రి నారోజా అలిగిందంటే, ఆ అలకలోని అందం చీకట్లోనే చూడాలని వుంది." మెల్లగా చేతి వేళ్ళతో ఆమె చెంపలపై గీస్తూ అన్నాడు.

"కరెక్ట్! ఇదే ఇదే! ఇలాంటి చేష్టలతోనే కరిగించేసి మగాళ్ళు ఆడవాళ్ళని దాసోహం చేసుకుంటారు అనిచెప్పి, చాలా కరెక్టుగా చెప్పింది రామాయమ్మ గారు ఆవిడ ఉపన్యాసంలో! ఈ చేష్టలన్నీ ఆమె వ్యక్తిత్వాన్ని పడగొట్టడానికే! ఆమెను స్వంతంగా బతకనియ్యక, స్వతంత్రంగా ఆలోచించనియ్యక, తనమీదే ఆధారపడి వుండేలా చెయ్యాలనుకోవడమే!" తను విన్నదంతా గుక్క తిప్పు కోకుండా ఏకరువు పెట్టింది రోజా.

"ఓహో! అదా సంగతి?" ఆ ఉపన్యాస మహిమా ఇదంతా" పకపకా నవ్వేడు క్రాంతి.

"ఏం నవ్వుతున్నారు? తాళికట్టిన ఇల్లాలు ఇలా మాట్లాడితే ఎగతాళిగా వుందా? అవును. పసుపు తాడుతో మూడు ముళ్ళువేసి బిగించి, ముక్కుకు తాడేసి లాక్కొచ్చి గొడ్డును దొడ్లో కట్టేసినట్టు, ఆమెను వంటింటికీ, పడక టింటికీ బానిసని చేసి, పిల్లలు కనే యంత్రంగా ఉపయోగించి, మీ ఇష్టం వచ్చినట్టు ఉపయోగించుకుంటారు మీ మగాళ్ళు! అంతేగానీ...."

"ఆపాపు నీ ప్రసంగం." ఆవేశంగా చెప్పుకపోతూన్న ఆమె ధోరణికి కళ్ళెం వేశాడు క్రాంతి.

ఆమె విసురుగా వెళ్ళి మంచం అంచున కూర్చుంది. బుంగమూతి పెట్టింది. ఆమెను ఆ భంగిమలో చూడగానే క్రాంతికి 'అలిగిన సత్యభామ'

స్ఫురించింది. చిన్నగా నవ్వుకున్నాడు. మెల్లగా వెళ్ళి ఆమె భుజం మీద చెయ్యి వేశాడు. చేతిని విసిరి కొట్టింది. ఆమె కోపం, అలక తాటాకు మంట లాంటివని క్రాంతికి తెలుసు.

ఓసారి కాపురానికి వచ్చిన కొత్తలో రోజాకి పుట్టింటిమీదికి మనసు మళ్ళింది. అక్కడినుంచి వచ్చి పదిరోజులు కాకుండానే "మా అమ్మను చూడాలని ఉంది. నేను మా ఊరు వెళతాను" అంటూ అలిగి కూర్చుంది.

క్రాంతికి ఏం చేయాలో తోచలేదు. దగ్గరా దాపు అయితే ఆమె కోరిక కాదనేవాడు కాదు. ఆమెకు నచ్చచెప్పటానికి చాలా ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. తన మీద అలిగి అన్నం తినటం మానేసింది.

"సరే పంపిస్తాను. ఒంటరిగా వెళ్ళగలవా?" అంటే, ససేమిరా వెళ్ళనంది. తను తోడువచ్చి దిగబెట్టాలని పట్టుబట్టింది. ఆఫీసులో పని వత్తిడి. సెలవు పెట్టే పరిస్థితి కాదు.

'పోనీ, మీ అమ్మగారినే ఇక్కడికి పిలిపించనా?' అంటే అదీ కుదరదని మంకుపట్టు పట్టింది.

చివరికి మెల్లగా దగ్గరికిచేరి బతిమాలి, బామాలి, 'వచ్చేవారం నాలుగు రోజులు సెలవు పెట్టి నిన్ను మీ పుట్టింటికి తప్పకుండా తీసుకెళతాను. అలక మాను!' అంటూ సర్ది చెప్పి ఆమెతో తిండి తినిపించే సరికి తలప్రాణం తోకకి వచ్చింది క్రాంతికి. అన్నమాట ప్రకారం ఆ తరువాతి వారంలో సెలవు పెట్టి రోజాని పుట్టింటికి తీసికెళ్ళక తప్పిందికాదు.

రోజాది చిన్నపిల్ల మనస్తత్వం. ఏ ప్రభావంలో పడితే దానిలోనే లీనమైపోతుంది. అందుకే ఆమె మనసును తెలుసుకొని సున్నితంగా డీల్ చేయాలి అనుకున్నాడు క్రాంతి.

క్రాంతి మెల్లగా ఆమె భుజాల మీద చేతులు వేసి తనవైపు తిప్పుకున్నాడు. తలని మరోవైపుకి తిప్పుకొంది రోజా.

"చూడు రోజా! నీవు చెప్పిన మాటలు బాగానే ఉన్నాయి. కానీ, ఎక్కడో విన్నదంతా అలా బట్టీకొట్టేయడమేనా? అందులో ఎంత నిజాలున్నాయి ఆలోచించవద్దూ?" రోజా ముక్కుపట్టుకొని లాగుతూ ముద్దుగా అన్నాడు క్రాంతి.

"నేనేమీ బిట్టీ పట్టలేదు. మధ్యాహ్నంనుంచి ఆమె చెప్పిన విషయాలన్నీ ఆలోచిస్తూనే వున్నాను. కట్నంకోసం కట్టుకున్న ఇల్లాలినే కాల్చి చంపే భర్తలు, అనుమానంతో ఆమెని లక్ష్మణ రేఖలా గడపదాటితే తప్పని ఆంక్షలు పెట్టి ఆమెచేత అడ్డమయిన చాకిరీ చేయించుకుంటూ ఆనందించడం నేరంకాదా? గడపదాటి బయటకొచ్చిన ఆడదాన్ని ఆటబొమ్మ లాగానో, అంగడిబొమ్మ లాగానో చూడడం అపరాధం కాదా? ఘోరం కాదా?" కోపంతో బుసలు కొడుతోంది రోజా.

ఆమె గొంతులోని తీవ్రతా, ఆమె ముఖంలోని ఆవేశం చూసి, ఆమె చాలా సీరియస్‌గానే ఈ విషయాన్ని గురించి మాట్లాడుతోందని గ్రహించాడు క్రాంతి.

రోజాది చాలా సున్నితమైన మనస్సు, ప్రతీ చిన్న విషయానికి ఎక్కువగా స్పందిస్తుంది పేపర్లో హత్యలూ, దొంగతనాలూ, దోపిడీలూ, పారిపోవడాలూ, పోట్లాడుకోవటాలూ వంటి వార్తలు చదివి, 'ఈ దేశం ఎటు పోతోంది? రేపటితరం ఏమైపోతుంది?' అని దిగులుపడిపోతుంది. హింస, రక్తపాతం మొదలైన విషయాలు విన్నప్పుడు కంపించిపోతుంది. అందుకే స్త్రీలను చిత్రహింసలు పెడుతున్నారు పురుషులు అనీ, ఆడదాని బతుకు అరిటాకు లాంటిదీ, మాతృత్వం ఆమె పాలిటి శాపం. ఆడది నేడు బతుకు తున్నది బానిస బతుకు అనీ రామాయమ్మగారు కొన్ని ఉదాహరణలతో, చక్కటి పదజాలంతో చెప్పిన మాటలు రోజా మనస్సుని కలవరపరచాయి అని తెలుసుకున్నాడు క్రాంతి. అందుకే తనూ సీరియస్‌గా చెప్పడం మొదలెట్టాడు:

"రోజా! మన దేశం, మన సంస్కృతి ఎంతగొప్పవో తెలుసా? పురుషుడు ఏనాడూ స్త్రీని శాసించలేదు. సమాజంలో మంచి మనుగడ కోసం, మనుషు లంతా ఒక్కటే అని బోధిస్తూ, కొన్ని కొన్ని ధర్మాలు నిర్వర్తించడానికి కొంత కొంతమందిని వర్గీకరించడం జరిగితే, అది ఈరోజు కులం పేరిట ఆ వర్గీకరణ పాతుకుపోయి, కులం అనేది మనిషి గుణాన్ని కూడా చంపేసి ఎలా మహమ్మారిలా మానవత్వాన్ని హరించివేస్తోందో! మనిషి నాగరికు డయ్యాక ఆదిమానవుడి దశనుంచి, వివాహ వ్యవస్థ అనే సిద్ధాంతాన్ని నమ్మేక ఆ వ్యవస్థలో స్త్రీ పురుషులకి కొన్ని ధర్మాలు సూచించారు. పురుషుడు బయటకు

వెళ్ళి ఆర్జించి పెడితే, స్త్రీ ఆ ఆర్జనని పొదుపుగా, అదుపుగా, కుటుంబంలోని సభ్యులందరికీ ఆప్యాయంగా పంచిపెడుతుంది. సృష్టికి మూలమైన స్త్రీ పురుషులిద్దరూ అలా వారివారి విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్నీ సమాజాన్నీ సమర్థవంతంగా దిద్దుకుంటూ వచ్చారు."

"అంతా వొట్టిది! సమానత్వం అంటూనే, ఆమెని బయటకు రానీయకుండా, నాలుగు గోడలమధ్యా బంధించారు. అవిద్యలో, అంధకారంలో ముంచెత్తారు." ఆమె కంఠంలో ఆవేశం, ఆవేదనా కూరుకుపోయింది. దగ్గరకు రాబోతున్న అతణ్ణి దూరంగా ఒక్కతోపు తోసింది.

"పిచ్చిదానా? నువ్వు నిజంగానే ఈ మాటలంటున్నావా? నువ్వన్న మాటలన్నీ నిజమయితే, నువ్వు పిహెచ్.డి. చేసేదానివీ కావు, లెక్చరరుగా ఉద్యోగమూ చేసేదానివి కావు. మీ అమ్మగారు సంగీత కచ్చేరీలూ చేసేది కాదు.... ఇంకా...."

"చాల్లెండి! నే చెప్పేది నా గురించి కాదు. ఏళ్ళతరబడి బానిసత్వపు ముసుగులో మగ్గిపోతూన్న లక్షలాది మహిళల గురించి."

"ఈ మాటలు మన భారత దేశానికి వర్తించవు. విదేశీ మహిళలకు వర్తిస్తాయి. ఏ హక్కూ లేకుండా యాంత్రిక జీవనాన్ని గడిపి విసిగిపోయి ఈ రోజున తెగించి బయటికొచ్చి హక్కులకోసం పోరాడుతున్న వాళ్ళెక్కడ? వైదిక కర్మలను సయితం నిర్వహించి వేద శాస్త్రాలు నేర్చుకున్న మన గార్గి, మైత్రేయీవంటి స్త్రీలు; యుగాల క్రితమే కలంపట్టి రచనలు చేసిన మొల్ల, కత్తిబట్టిన ఝాన్సీ, స్వాతంత్ర్య పోరాటంలో నడుం బిగించి ముందుకొచ్చిన సంఘ సంస్కర్తలూ, రాజకీయ నాయకీమణులూ, మనకి కో కొల్లలు! వారందరినీ పురుషులూ ఏనాడూ చిన్న చూపు చూడలేదు. మధ్య యుగంలో అనేక సాంఘిక మార్పులవల్ల, భద్రత కోసం, స్త్రీని బయటకు వెళ్ళకుండా కొన్ని నిర్బంధాలు పెట్టారేతప్ప, ఆమెను చులకన చెయ్యడానికి కాదు." ఈసారి క్రాంతి గొంతు తీవ్రంగా పలికింది.

"కబుర్లు చెప్పకండి. నాడు కన్యాశుల్కం నేడు వరకట్నం పీడిస్తున్నది పురుషులు కాదా? కట్నం తెలేదనో చాలలేదనో కాల్చిచంపుతూన్నది మీరు కాదా? ఆడది కనబడితే చాలు మింగేసేలా చూసి, చెడగొట్టేది మీరు కాదా?"

"కాదు!"

"మరి?"

"దానికి కారకులు మీరే! పెళ్ళిలో కట్నం కోరేదీ, లాంఛనాలు ఆశించేదీ ఆడదే! కళ్యాణం తరవాత కిన్న కొడుకు ఎక్కడ తనకి దూరమై పోతాడోనన్న దురాశతో, కోడలు కూడా కూతురిలాంటిదే అన్న మమకారం కూడా లేకుండా లేనిపోని నిందలు మోపి, కొడుకుకు దగ్గర కాకుండా చూసేదీ ఆడదే! కోడళ్ళని కిరసనాయిల్ పోసి చంపేవాళ్ళలో, ఆడదాని ప్రమేయం, ప్రోత్సాహం లేకుండా కేవలం ఎంతమంది మొగాళ్ళున్నారు ఒక్కసారి ఆలోచించు! స్వాతంత్రం ఒకరిస్తే పుచ్చుకునేదికాదు. అసలు స్త్రీ బానిసత్వాన్నీ బంధనాలనీ, ఆచారాల పేరిట తనకుతానే తెచ్చిపెట్టుకుంటోంది. తను నోచిన ప్రతి నోమూ, వ్రతమూ భర్త శ్రేయస్సుకే అని పొంగపెడుతోంది. కానీ అతడు బాగుంటే తనూ బాగుంటుందనే స్వార్థచింతన అందులో లేదా? ఎందుకీ ఆత్మ వంచన! నా ప్రగతికోసం నేనూ విద్య నేర్చుకుంటాను. నా ఆత్మ విశ్వాసంకోసం నేనూ ఉద్యోగం చేస్తాను. స్త్రీ పురుషు లిరువురికీ ఒకరికొకరు కావాలి కనుక ఇద్దరం సమానమే అనే భావన పైకి రానీయకుండా తనకితానే సంకెళ్ళు బిగించుకుంది.

"అంటే మీ ఉద్దేశంలో తప్పంతా స్త్రీలదే నన్నమాట! తాగి తన్నే భర్త, ఇల్లాలిని పట్టించుకోకుండా తిరుగుబోతుగా వ్యవహరించే భర్త.... అన్నింటికీ తనే బాధ్యురాలా?" కోపంగా అరిచింది రోజా.

"అని నేనన్నానా? అటువంటివాళ్ళకి తప్పకుండా బుద్ధి చెప్పాలి. బుద్ధి రాకపోతే తెగతెంపులు చేసుకోవాలి. అంతేకానీ, నోరు మూసుకుని బాధలు భరించవలసిన అవసరం లేదు. అంతేగానీ, మొత్తం పురుషజాతినే శంకించడం, ద్వేషించడం మంచి పద్ధతి కాదు. గయ్యాళి భార్యలతో, అర్థంచేసుకోని ఆడవాళ్ళతో ఎంతమంది బాధపడడంలేదు? అంతమాత్రంచేత స్త్రీలందరినీ దూషించడం ధర్మమా? ఏమంటావ్?" అడిగాడు క్రాంతి.

అతడి మాటలు సబబుగానే తోచాయి రోజాకి. ఆలోచిస్తున్న రోజాని చూసి మళ్ళీ క్రాంతి చెప్పడం మొదలెట్టాడు: ''భార్యాభర్తల మధ్య వుండ వలసింది, అప్యాయతా, అనురాగం, నమ్మకం. ఈ మూడు గుణాలూ ఎవరిలో లోపించినా ఆ సంసారం కుంటుతూనే సాగుతుంది. ఆ బ్రతుకు దుర్భరమనిపిస్తుంది. కులమతాల తారతమ్యాలు ఎంత బాధాకరమైనవో, స్త్రీ పురుషుల అంతరాలు అంతకన్నా ఘోరమైనవి. అవి సమసిపోవడానికి ఎంతో కృషి కావాలి. అయితే ద్వేషంతోనూ, కసితోనూ మాత్రం కాదు" అన్నాడు.

క్రాంతి మాటల్లో ఎంతో సత్యం వుందనిపించింది రోజాకి. తృప్తిగా నిట్టూర్చి అవలిస్తూ నిద్రపోవడానికి దిండు సరిచేసుకుంటూ, గడియారం కేసి చూసింది. టైము అయిదున్నర దాటింది. కంగారుగా లేవబోయింది.

"పడుకో! ఎందుకులేస్తున్నావ్?" అడిగాడు క్రాంతి.

"మీరు ఏడింటికల్లా వెళ్ళిపోవాలన్నారుగా! టిఫిన్ చెయ్యాలి."

"నేను చేసుకుంటాలే, పడుకో."

"అయ్యో! మీరు చేసుకోవడమేమిటి?" కంగారుగా లేవబోయింది.

పగలబడి నవ్వాడు క్రాంతి.

"స్వేచ్ఛ ఇచ్చినా పుచ్చుకోవడం నీకు చాతకావడం లేదు చూశావా? నిన్ను నిద్ర పాడుచేసుకుని, టిఫిన్ చేసి పెట్టమని శాసించలేదూ, ఆజ్ఞాపించలేదూ, ఆక్షేపించడమూ లేదు. అయినా నీకు నువ్వే కంగారుపడి లేచిపోతున్నావు పడుకోకుండా!"

"మొగుడు లేచి పనిచేస్తూవుంటే పెళ్ళాం బరితెగించినదానిలా ఎలా పడుకుందో అంటారు ఎవరైనా చూస్తే."

''మాట్లాడానికి అనడానికి ఇప్పుడు ఇంట్లో ఎవరున్నారు? నీలో జీర్ణించుకు పోయిన భావాలే నిన్ను కలవరపెడుతున్నాయి. మన ఇంట్లో మనకి అనుకూల

మైన విధంగా మన పన్లు మనం చేసుకోవడంలో తప్పేముంది? జీవితంలో స్త్రీ పురుషులు మమతా, అనురాగం, ఆనందం, గౌరవం ఒకళ్ళకొకళ్ళు ఇచ్చి పుచ్చుకోవాలి! పరమశివుడు పార్వతికి సగం దేహమిచ్చి సమానత్వాన్ని చాటుకోలేదూ? గంగని శిరస్సుపై కూర్చుండబెట్టి ఆమె అధిక్యతని అంగీకరించలేదూ? శ్రీకృష్ణుడు పాదదాసుడనంటూ సత్యభామ కాళ్ళు పట్టుకోలేదూ?"

"అవునండీ! మూఢాచారాలతో, మూఢనమ్మకాలతో, స్త్రీ తననితానే వంచించుకుంటోంది. భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన వుంటే అనర్థాలేముంటాయి? సమాజంలో స్త్రీ పురుషులు సూర్యచంద్రుల్లాంటివారు. ఇరువురి స్వభావగుణం వేరైనా, ధర్మమొక్కటే!" అంది రోజా నవ్వుతూ.

"అబ్బా! ఎంత బాగా చెప్పేవోయ్!" అంటూ ఆమె నడుంచుట్టూ చెయ్యివేసి బాహువుల్లో బంధించేశాడు క్రాంతి.

కిటికీలోనుంచి నులివెచ్చని కిరణాలు వారి ఊహలకు మరింత వేడినిచ్చాయి!

*